www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 29 జూన్ 2025



పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఎన్టీఆర్ వైద్య సేవలో పనిచేస్తున్న వారికి 2 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ హాస్పిటల్‌లో పనిచేస్తున్న ఎన్టీఆర్ వైద్య సేవ ఉద్యోగులకు వేతనాలు రాకపోవడం వల్ల తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అడిగితే ఎక్కడ తీసేస్తారనే భయాందోళనకుగురవుతున్నారని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ఆసుపత్రులలో ఇదే పరిస్థితి నెలకొందని తెలిపారు. అడిగితే తప్ప వేతనాలు రావని పేర్కొన్నారు. జిల్లా అధికారుల దృష్టి తీసుకెళ్తే జీతం వస్తుంది, లేకుంటే లేదని తెలిపారు. జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లితే కొద్దిమంది కాంట్రాక్టర్లు కక్షగట్టి దుర్మార్గంగా బెదిరించడం, చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న 2 నెలల వేతనాలు ఇవ్వాలని తెలిపారు. వీటిపై గ్రీవెన్స్‌లో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

సగిలేరు గురుకుల పాఠశాలను తరలించొద్దు

ఆర్‌డిఒ కార్యాలయ ఎఒకు ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ నాయకుల వినతి



ఆర్‌డిఒ కార్యాలయ ఎఒకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - బద్వేలు

బద్వేల్ నియోజకవర్గంలోని సగిలేరు గురుకుల పాఠశాలను తరలించాలని ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను తక్షణమే ఆపాలని లేకపోతే విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ నాయకులు హెచ్చరించారు. పాఠశాలను యథా స్థానంలోనే కొసాగించాలని డిమాండ్ చేశారు. శనివారం ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ సంఘాల ఆధ్వర్యంలో ఆర్‌డిఒ కార్యాలయ ఎఒకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు ఎద్దు రాహుల్, డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని సంయుక్తంగా మాట్లాడుతూ బద్వేల్ నియోజకవర్గం బి. కోడూరు మండలం, సగిలేరు బాలుర గురుకుల పాఠశాలను 1983లో ఏర్పాటు చేశారన్నారు. అప్పటినుంచి ప్రతి ఏడాదీ దాదాపు 600 మంది విద్యార్థులు పైగానే విద్యను అభ్యసిస్తున్నారని చెప్పారు. గురుకుల బాలుర పాఠశాల ఆహ్లాదకరమైన చక్కని వాతావరణంలో కొనసాగుతుందన్నారు. గత కొంతకాలముగా సగిలేరు గురుకుల పాఠశాలను ప్రభుత్వం పట్టించకపోవడం వల్ల ప్రస్తుతం పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని సరైన మౌలిక సౌకర్యాలు కరువయ్యాయని, బ్రహ్మంగారిమఠంలోని తోట్లపల్లి సమీపంలో ఉన్న మహా గురుకులం విలీనం చేసేందుకు కలెక్టర్ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. బద్వేల్ నియోజకవర్గంలోని అధికార, విపక్ష ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, చైర్మన్లు, ఇన్‌ఛార్జులు కలెక్టర్ నిర్ణయాన్ని వ్యతిరేకించలేదన్నారు. . కనీసం గురుకుల పాఠశాలను నిలిపేందుకు మాట్లాడే ధైర్యం చేయకపోవడం సిగ్గు పడాల్సిన విషయం అన్నారు. తోట్లపల్లి దగ్గర నిర్మాణం రూపొందుకున్న మహా గురుకులంలో జులై 2 నుంచి తరగతులు ప్రారంభం కానున్నట్లు కలెక్టర్ స్వయంగా ఆదేశాలు ఇవ్వడం సరైంది కాదని చెప్పారు. సగిలేరులో ఉన్నటువంటి ఎస్‌సి గురుకుల పాఠశాలను అక్కడే కొనసాగించి, విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించి అక్కడే తరగతులు నిర్వహించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రంపల్లి అజయ్ కుమార్, డివైఎఫ్‌ఐ బద్వేల్ పట్టణ అధ్యక్షులు షేక్ మస్తాన్ షరీఫ్, రూరల్ అధ్యక్షులు ముడమాల ఓబుల్ రెడ్డి పాల్గొన్నారు.

పోరుమామిళ్ల (కాశినాయన) : సగిలేరు రెసిడెన్షియల్ పాఠశాలను తరలించడం అన్యాయమని సిపిఎం మండల కార్యదర్శి బైరవ ప్రసాద్, ప్రజా సంఘాల నాయకులు వీరయ్య, ముత్యాల ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోరుమామిళ్ల మండల పరిధి చివరిలోని సగిలేరు గురుకుల పాఠశాలను బ్రహ్మంగారి మఠానికి తరలించడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతారన్నారు. పోరుమామిళ్ల, బి. కోడూరు, కాశినాయన మండలాలకు చెందిన విద్యార్థులకు సగిలేరులో ఉన్న రెసిడెన్షియల్ పాఠశాల అనుకూలముగా ఉందని, బి. మఠానికి ఎందుకు తరలిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. పాఠశాలలో సౌకర్యాలు లేకపోతే కల్పించి అభివృద్ధి చేయాలే తప్ప తరలించడం సరైంది కాదన్నారు. కనీసం మూడు మండలాల ప్రజాప్రతినిధులు కూడా పాఠశాల తరలింపుపై మాట్లాడకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ ప్రయత్నం విరమించుకొని యథాస్థానంలోనే రెసిడెన్షియల్ పాఠశాలను నడపాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- ఐక్య కార్మిక సంఘాల డిమాండ్


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్లు రద్దుచేయాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని కోరుతూ జులై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఎఐటియు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎల్.నాగసుబ్బరెడ్డి, బి.మనోహర్, ఐఎఫ్‌టియు, జిల్లా నాయకులు డబ్ల్యు.రాము, యుటియుసి జిల్లా నాయకులు కె.సుబ్బరాయుడు, ఎఐసిసిటియు జిల్లా నాయకులు ఓబయ్య, యుటియుసి జిల్లా నాయకులు రమణయ్య డిమాండ్ చేశారు. శనివారం హోచిమన్ భవన్ ఎఐటియుసి కార్యాలయంలో కార్మిక, రైతు, వ్యవసాయ సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటిష్ వారితో కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను సైతం మోడీ మతోన్మాద ప్రభుత్వం రద్దు చేసి కార్మిక వర్గాన్ని యాజమాన్యాలకు బానిసలుగా మార్చేందుకు 4 లేబర్ కోడ్స్ తెచ్చిందని విమర్శించారు. ఈ లేబర్ కోడ్ల వల్ల కార్పొరేట్ల లాభాలు పెరిగి, కార్మికులు ఏ హక్కులు లేని బానిసలుగా మారిపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వతంత్రానికి ముందు కానీ, తర్వాత కానీ, కార్మిక చట్టాలు ఏ దయతో వచ్చినవి కాదని, వేలాదిమంది కార్మికులు తమ ప్రాణాలను త్యాగం చేసి సాధించుకున్న హక్కులని గుర్తు చేశారు. 4 లేబర్ కోడ్స్ అమలులో కార్మికులను కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు 10 గంటలు పని విధానం ముందుకు తెచ్చారని పేర్కొన్నారు. కరోనా సంక్షోభాన్ని, ఉగ్రవాద సంక్షోభ పరిస్థితులను మోడీ మతోన్మాద ఎజెండాను అమలుపరిచేందుకు, కార్పొరేట్ శక్తులను సంతృప్తి పరిచేందుకు వాడుకుంటుందని విమర్శించారు. ఇటువంటి కార్మిక వ్యతిరేక, ప్రజావ్యతిరేక, రైతు వ్యతిరేక విధానాలకు సమ్మెల ద్వారా కట్టడి చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. జులై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ప్రభుత్వ రంగ సంస్థలైన బ్యాంకింగ్, ఎల్ఐసి, పోస్టల్, బిఎస్ఎన్ఎల్ పాల్గొంటున్నారని, ప్రభుత్వ పథకాలలో పనిచేసే ఉద్యోగులు, అసంఘటిత కార్మికులు అందరూ కూడా సమ్మెను బలపరచడం ద్వారా మోడీ చంద్రబాబు కార్పొరేట్ మతోన్మాద విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎఐటియుసి, సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.వేణుగోపాల్, కె.శ్రీనివాసులురెడ్డి, ఎఐటియుసి జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కె.సి.బాదుల్లా, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున, నగర ప్రధాన కార్యదర్శి ఉద్దే మద్దిలేటి, నగర నాయకులు లింగన్న, మల్లికార్జున, పుల్లయ్య, నాగిరెడ్డి, శాంతమ్మ, అమ్ములు, ఏపి డప్పు కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, సిఐటియు జిల్లా కోశాధికారి లక్ష్మీదేవి, నగర అధ్యక్ష, కార్యదర్శులు చంద్రారెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి, సిఐటియు జిల్లా నాయకులు రామ్మోహన్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్, వెంకటసుబ్బయ్య, గోపి, నరసింహ రావు, పవన్ కుమార్, స్టీఫెన్, కొండయ్య పాల్గొన్నారు.


తలపడుతున్న కడప, కర్నూలు జట్లు

డ్రాగా ముగిసిన కడప, కర్నూల్ మ్యాచ్

ప్రజాశక్తి - కడప

ఎసిఎ సౌత్ జోన్ అండర్ –19 మల్టీ డే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో కడప, కర్నూలు జట్ల మధ్య నిర్వహించిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో 765 పరుగులు చేసింది. ఒక వికెట్ నష్టానికి 14 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన కర్నూలు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 97.0 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 331 పరుగులు చేసింది. ఆ జట్టులోని విష్ణువర్ధన్ నాయుడు 100 పరుగులు(సెంచరీ) చేసి నాటౌట్ గా నిలిచాడు. సాయి గణేష్ 72 పరుగులు చేశాడు. కడప జట్టులోని శివ శంకర 3, ఆర్థిత్ రెడ్డి 2 వికెట్లు తీసుకున్నారు. మ్యాచ్ డ్రాగా ముగిసింది. కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో నెల్లూరు జట్టుపై అనంతపురం జట్టు 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మ్యాచ్ లో మొదటి ఇన్నింగ్స్‌లో నెల్లూరు జట్టు 212 పరుగులు చేసింది. అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 524 పరుగులు చేసింది. మూడు వికెట్లు నష్టానికి 173 పరుగుల ఓవర్ నైట్ స్కోర్ తో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన నెల్లూరు గట్టు రెండవ ఇన్నింగ్స్‌లో 99.2 ఓవర్లలో 405 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని కారుణ్య ప్రసాద్ 135 పరుగులు (సెంచరీ) చేశాడు. షావుల్ హమీద్ 89 పరుగులు చేశాడు. అనంతపురం జట్టులోని సాయి ప్రతాప్ రెడ్డి 3, వీరారెడ్డి 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు రెండవ రోజు ఆటో సమయానికి 24.3 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 94 పరుగులు చేసి 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.

ఎన్ఐఎస్‌డి స్టీరింగ్ కమిటీ సభ్యురాలిగా డాక్టర్ లలిత

ప్రజాశక్తి - కడప అర్బన్ : సీనియర్ సిటిజన్స్ విభాగంలో 'జెరియాట్రిక్ కౌన్సెలింగ్' పై అడ్వాన్స్ కోర్సు మాడ్యూల్‌ను సిద్ధం చేయడానికి ఏర్పాటు చేసిన స్టీరింగ్ కమిటీలో సభ్యురాలిగా యోగి వేమన విశ్వవిద్యాలయం సైకాలజీ శాఖ అసోసియేట్ ప్రొఫెసర్ కె.లలితకు చోటు లభించింది. భారత ప్రభుత్వ సామాజిక న్యాయం సాధికారత మంత్రిత్వ శాఖ పరిధిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ డిఫెన్స్ (ఎన్ఐఎస్‌డి) సంస్థ వృద్ధుల కోసం మాడ్యూలను సిద్ధం చేయనుంది. అడ్వాన్స్ కోర్సు అయిన 'జెరియాట్రిక్ కౌన్సెలింగ్' కోసం సమగ్ర కోర్సు పాఠ్యాంశాలు, మాడ్యూళ్లను అభివృద్ధి చేసే లక్ష్యానికి అనుగుణంగా చైర్మన్‌తో పాటు ఆరుగురు సభ్యులున్న స్టీరింగ్ కమిటీని నామినేట్ చేసింది. చైర్మన్‌గా ఎన్ఎస్ఐడి డిప్యూటీ డైరెక్టర్ (సీనియర్ సిటిజన్ డివిజన్) డాక్టర్ హెచ్.సి.శ్రీధర్, చెన్నకేశవ, రంగారెడ్డితో పాటు వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులతో కూడిన కమిటీలో వైవీయూ నుంచి డాక్టర్ లలిత పనిచేయనున్నారు. ప్రొఫెసర్ డాక్టర్ లలితకు చోటు దక్కడం ప్రశంస నీయమని విశ్వవిద్యాలయ విసి ఆచార్య అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, సైకాలజీ విభాగాధిపతి డాక్టర్.వి.లాజర్‌ఆమెను అభినందించారు.

టాపర్స్‌గా మహిళా న్యాయవాదులు

ప్రజాశక్తి -కడప : కడప బార్ అసోసియేషన్ హాల్‌లో భారత న్యాయవాదుల సంఘం (ఐఎఎల్) శనివారం నిర్వహించిన జూనియర్ సివిల్ జడ్జి మోడల్ పరీక్షలో మహిళా న్యాయవాదులే టాపర్స్‌గా నిలిచారని కడప, అన్నమయ్య ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సి.సుబ్రహ్మణ్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఈశ్వర్, ఉపాధ్యక్షులు ఏ.ఉమాదేవి ప్రకటించారు. శనివారం కడపలో ని 25 మంది యువ న్యాయవాదులు మోడల్ పరీక్ష రాసినట్లు తెలిపారు. మల్టిపుల్ ఛాయిస్ పద్ధతిలో 100 ప్రశ్నలకు 100 మార్కులకు గాను మహిళా న్యాయవాదులు ఎం. మీనాక్షి 95, బి.జుబేదా 92, ఎం.స్పందన 91, కే. సునీత 85, ఎస్. ప్రవల్లిక 84, ఎస్. అస్మతియా 83 మార్కులు సాధించారని ఐఎఎల్ నాయకులు ప్రకటించారు. అంతకుముందు కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాఘవరెడ్డి ప్రశ్న పత్రాన్ని విడుదల చేశారు. సేవా భావంతో రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ సివిల్ జడ్జి మోడల్ పరీక్షను భారత న్యాయవాదుల సంఘం నిర్వహించడాన్ని ఆయన అభినందించారు. మోడల్ పరీక్షలో తక్కువ మార్కులు వచ్చాయని ఎవరు నిరుత్సాహ పడకూడదని పట్టుదలతో మరింతగా కృషి చేయాలని ఆయన సూచించారు. మోడల్ పరీక్ష నిర్వహణలో సీనియర్ న్యాయవాది సంపత్ కుమార్ పాల్గొని జూనియర్ న్యాయవాదులకు సూచనలు సలహాలు ఇచ్చారు. మోడల్ పరీక్ష నిర్వహణలో కడప బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు మునికుమార్‌రెడ్డి,న్యాయవాదులు జగదీశ్వర్‌రెడ్డి, కె. సూర్యనారాయణ రెడ్డి అర్చన, సోనీ, రమ్య గీత పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే సమాజంలో గుర్తింపు

ప్రజాశక్తి - బద్వేలు : ఉపాధ్యాయులకు విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించినప్పుడే వారికి సమాజంలో గుర్తింపు లభిస్తుందని చిన్నకేశంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంజి పెంచలయ్య పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన ఉపాధ్యాయ బదిలీలలో భాగంగా పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు శనివారం ఉదయం చిన్నకేశంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని, దానిని సక్రమంగా నిర్వర్తించినప్పుడే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. చిన్నకేశంపల్లె ఉన్నత పాఠశాల అభివృద్ధికి, విద్యాభివృద్ధికి కృషి చేసిన ఉపాధ్యాయుల సేవలు మరువలేనివన్నారు. పదవ తరగతి ఫలితాల సాధనలో చిన్నకేశంపల్లె పాఠశాలకు ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. వరుసగా పదిసార్లు 100 శాతం ఫలితాలను సాధించిన ఘనత చిన్నకేశంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సొంతమన్నారు. అనంతరం పాఠశాల నుండి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు టి.పెంచలయ్య, టి.వి.సుబ్బారావు, మాదన విజయకుమార్, ఎస్.వరలక్ష్మి లను దుశ్శాలవలతో, పూలమాలలతో జ్ఞాపికలను ఇచ్చి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజ్ కుమార్ రెడ్డి, శివప్రసాద్, రవీంద్రారెడ్డి, పి.సుబ్బరాయుడు, ఎస్.గౌస్ బాషా, సి.వి.రమణ, వై.రామ్మోహన్, పీరాన్ సాహెబ్, సి.హెచ్.సాగర్, అరుణ్ కుమార్, సుజాత గ్రామ పెద్ద ఓ.ప్రతాపరెడ్డి, పాఠశాల విద్యార్థులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు నెలనెలా సీమ సాహిత్యం

ప్రజాశక్తి- కడప అర్బన్ : యోగివేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా 144వ సదస్సును ఈనెల 29న ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సదస్సులో 'సజీవ సంప్రదాయంగా వేమన' అనే అంశంపై తెలుగు భాషా సేవకులు స.వెం.రమేశ్ (శ్రీకాళహస్తి) ప్రసంగిస్తారని తెలిపారు.

ఆలయాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- టిటిడి జెఇఒ వీరబ్రహ్మం


దేవుని కడప ఆలయాన్ని పరిశీలిస్తున్న జెఇఒ

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలోని దేవుని కడప శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి, ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి ఆలయాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని టిటిడి జెఇఒ వి.వీరబ్రహ్మం ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. దేవుని కడప, ఒంటిమిట్ట ఆలయాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన వేరువేరుగా సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జెఇఒ మాట్లాడుతూ దేవుని కడపలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో త్వరలో జరుగనున్న బాలాలయం కోసం ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఆలయ గర్భాలయంలో పోటు గదిలో వర్షం నీరు లీకేజీలు లేకుండా చూడాలని, విద్యుత్ పాత వైర్లు తొలగించి కొత్త వైర్లు ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గర్భాలయంలో పైభాగాన ఉన్న కాలం చెల్లిన కొయ్య దంతెలను తొలగించే అంశం, ఆలయంలో అవసరమైన గ్రానైట్ పనులు, పోటు పెంపు, పిఎసి వద్ద లిఫ్ట్ ఏర్పాటు, ఆలయం చుట్టూ రోడ్ల విస్తరణ, విలువైన వస్తువులు భద్రపరుచుకునేందుకు స్ట్రాంగ్ రూం ఏర్పాటు, భక్తులకు సౌకర్యవంతంగా పార్కింగ్, నూతన వాహన మండపం, తదితర మరమ్మతుల పనులపై నివేదిక తయారు చేయాలని అధికారులను కోరారు. పుష్కరిణి వద్ద మురుగు నీరు నిల్వ ఉండకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని కార్పోరేషన్ అధికారులకు సూచించారు. అనంతరం ఒంటిమిట్ట శ్రీకోదండరామ స్వామి వారి ఆలయం పరిసరాలలో జరుగుతున్న పనులపై సమీక్ష నిర్వహించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మరింతగా అన్నప్రసాదాలు పంపిణీ చేసేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కల్యాణ వేదిక వద్ద భక్తులకు కనిపించేలా శంఖు, చక్రాలు ఏర్పాటు చేయాలన్నారు. భక్తులను ఆకట్టుకునేలా ఆలయం సమీపంలో 27 నక్షత్రాలు, చెట్లను ఏర్పాటు చేయాలని చెప్పారు. ఒంటిమిట్ట ఆలయ పరిధిలో పెండింగ్ లో ఉన్న ఇంజనీరింగ్ పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కడప మునిసిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, ఎస్ఇ (ఎలక్ట్రికల్) వేంకటేశ్వర్లు, డిప్యూటీ ఇఒలు నటేష్ బాబు, ప్రశాంతి, ఇఇలు నాగరాజు, సుమతి, పలువురు అధికారులు, ఆలయాల అర్చకులు, ఆలయ ఇన్ స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు పరిహారం అందేలా చర్యలు : జెసి


అధికారులతో సమీక్షిస్తున్న జెసి అధితి సింగ్

ప్రజాశక్తి - కడప

జాతీయ రహదారుల విస్తరణ కోసం చేపట్టిన భూసేకరణలో భాగంగా ఉద్యాన పంటలు, వృక్షాలు కోల్పోతున్న రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని జెసి అధితి సింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారుల విస్తరణ కోసం చేపట్టిన భూ సేకరణలో ఉద్యాన పంటలు, చెట్లు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం అంచనా ప్రక్రియపై శనివారం కడప కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి సంబంధిత అధికారులు, ఆయా డివిజన్‌ల ఆర్‌డిఒలు, తహశీల్దార్లతో జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సమీక్షకు ఎస్‌డిసి, ఎన్‌హెచ్ పీడీ వెంకటపతి, జమ్మలమడుగు, పులివెందుల ఆర్‌డిఒలు సాయిశ్రీ, చిన్నయ్య సంబంధిత రీజియన్ల ఎన్ హెచ్ఎఐ, ఎన్‌హెచ్ పీడీలు హాజరయ్యారు.ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ బెంగుళూరు–కడప–విజయవాడ జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి భూసేకరణ చేపడుతున్నామని చెప్పారు. అందుకు సంబంధించి జిల్లా పరిధిలో ప్రభుత్వ, ప్రయివేటు, అటవీ శాఖకు చెందిన పలు భూములను కొనుగోలు చేస భూములు కోల్పోయినవారికి పరిహారం ఇస్తున్నామని చెప్పారు. భూసేకరణ ప్రక్రియలో భాగంగా జమ్మలమడుగు, వి.ఎన్. పల్లె మండలాల్లో ఉద్యాన పంటలు కోల్పోతున్న రైతులకు ఎలాంటి నష్టం చెల్లించకుండా భూసేకరణ చట్టంలోని సంబందింత ప్రామాణికాలను పక్కాగా పాటిస్తూ పరిహారం అంచనాలను నివేదించాలని చెప్పారు. వృక్షాల వయస్సు, చెట్ల పెంపకానికి ఎరువులు, ఫర్టిలైజర్స్ ఇతర నిర్వహణకు సంబంధించి ఇప్పటివరకు రైతులు వెచ్చించిన వ్యయం తదితర అంశాలను ఉద్యాన వన శాఖ అధికారులు కచ్చితంగా, పారదర్శకంగా వ్యాల్యుయేషన్ చేయాలన్నారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్ ఎఐ పీడీ అశోక్ కుమార్, ఆర్అండ్‌బి నేషనల్ హైవే ఇఇ విజయ్ భాస్కర్ రెడ్డి, ఎన్‌హెచ్ ప్రాజెక్టుల ప్రనిధులు, ఫారెస్ట్, భూసేకరణ, రెవెన్యూ, ఉద్యాన, వ్యవసాయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణులు సిద్ధమవ్వాలి : డిసిసి

ప్రజాశక్తి - కడప : కడప నగరంలోని 50 వార్డులపై కాంగ్రెస్ పార్టీ విజయాన్ని సాధించి మేయర్ పదవిని కైవసం చేసుకోవాలని డిసిసి అధ్యక్షులు ఎన్.డి. విజయజ్యోతి పిలుపునిచ్చారు. శనివారం ఆమె కడపలోని ఇందిరాభవన్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న కడప నగర వార్డు సభ్యుల పదవీ కాలం 2026 మార్చి 13న ముగియనున్నట్లు తెలిపారు. ఇంకా సుమారు తొమ్మిది నెలల సమయం మాత్రమే ఉందని, కాంగ్రెస్ పార్టీ నేతలంతా ఇప్పటి నుండే నగర ఎన్నికలపై దృష్టి పెట్టాలని సూచించారు. వార్డుల వారీగా సమీక్షలు నిర్వహిస్తూ, పార్టీ బలాన్ని పెంచే చర్యలు తీసుకోవాలని ఆమె అన్నారు. ప్రతి వార్డులో కాంగ్రెస్ విజయాన్ని సాధించి కడప మేయర్ స్థానం కాంగ్రెస్ పార్టీకి దక్కేలా అన్ని శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని ఆమె స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు సిరాజుద్దీన్, కదిరి ప్రసాద్ గౌడ్, మైనార్టీ జిల్లా అధ్యక్షులు రహమతుల్లాఖాన్, మైనార్టీ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ నీలం, రఫీ ఖాన్ స్టేట్ మైనార్టీ ప్రధాన కార్యదర్శి, సుశీల్ కుమార్ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మామిళ్ళ బాబు ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు, ముబారక్, కడప నగర మైనార్టీ అధ్యక్షులు, శీలం గంగయ్య పాల్గొన్నారు.

రైతులకు మినీ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - వల్లూరు : రైతులకు మినీ కిట్లను ఎమ్మెల్యే పుత్తా చైతన్య రెడ్డి శనివారం పంపిణీ చేశారు. వల్లూరు మండలంలోని దిగువపల్లెలో రైతు సేవా కేంద్రం ద్వారా 80 శాతం సబ్సిడీతో వచ్చిన కిసాన్ డ్రోన్‌ను రైతు ఎర్రమరెడ్డి శివారెడ్డికి అందజేశారు. అనంతరం రైతులకు ఉచితంగా మినుములు, రాగులు, జొన్నలను పంపిణీ చేశారు. వ్యవసాయ రంగంలో రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేసిందన్నారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ చంద్రనాయక్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ నరసింహారెడ్డి, శాస్త్రవేత్తలు వీరయ్య, సునీల్, మానస, మండల వ్యవసాయ అధికారి కిరణ్ కుమార్ రెడ్డి, మండల టిడిపి అధ్యక్షుడు లేబాక నాగేశ్వర్ రెడ్డి ,దిగువపల్లి సర్పంచ్ కుళ్లాయప్ప ,టిడిపి నాయకులు మదన్ మోహన్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

13న కడపలో రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు

ప్రజాశక్తి - కడప : కడప బాడీ బిల్డర్స్ అసోసియేషన్, ప్రకాశం జిల్లా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలో ఉన్న సబ్ జైల్ ప్రాంతంలో గల శ్రీ సాయి శ్రీనివాస గార్డెన్‌లో జులై 13న రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించనున్నామని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నూనె నాగేష్, షేక్ యునస్ బాషా తెలిపారు. శనివారం కడప నగరంలోని మిస్టర్ ఫిట్ జిమ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నిర్వహించారు. సమావేశంలో మొదట పోటీలకు సంబంధించిన ట్రోఫీలు, పోటీలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాడీ బిల్డింగ్ , మోడలింగ్ రాంప్ పోటీలు కూడా ఉంటాయన్నారు. రాష్ట్ర స్థాయిలో ఈ పోటీలో నిర్వహిస్తున్నామని, వివిధ జిల్లాల నుంచి సుమారు 300 మంది బాడీ బిల్డర్లు పాల్గొనవచ్చని అంచనా అన్నారు. సౌత్ ఇండియాలో ఇచ్చే విధంగా నగదు బహుమతులు ఇస్తున్నామని చెప్పారు. పోటీలలో పాల్గొనే బాడీబిల్డర్లకు జడ్జిలకు అఫీషియల్స్‌లకు మూడు పూటలా భోజన వసతి కూడా ఉంటుందన్నారు. ఈ పోటీలకు బాడీబిల్డర్లు సిద్ధంగా ఉండాలని వారు కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మన్ ఇ.వి కుమార్, సీనియర్ బాడీ బిల్డర్‌లు రషీద్ మహారాజ్, ఆర్గనైజింగ్ చైర్మన్ ఎస్ఎండి తాహీర్, మెరీన్ కుమార్, నరసింహులు కుమార్, విజయ్ కుమార్, నాగేంద్ర పాల్గొన్నారు

ఖైదీలు ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి

ప్రజాశక్తి - కడప : ఖైదీలు తమ ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, డాక్టర్ సి. యామిని, సీనియర్ సివిల్ జడ్జి, ఎస్. బాబా ఫక్రుద్దీన్ పేర్కొన్నారు. శనివారం వారు కడప పురుషుల కేంద్ర కారాగారం, ప్రత్యేక మహిళా కారాగాలను, ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడి వారి కేసులు, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం జైలు పరిసరాలను, వంటగదులను, వసతి గదులను, టాయిలెట్లను, రిజిస్టర్‌లను పరిశీలించి తగు సూచనలను సలహాలిచ్చారు. మానసిక వ్యాధులతో బాధపడే ఖైదీల ఆరోగ్య విషయాలను వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. సకాలంలో మందులను వాడాలని తెలియజేశారు. వారి వెంట కేంద్ర కారాగారం డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్ రాజేశ్వర్ రావు, ప్రత్యేక మహిళ కారాగారపు సూపరిండెంట్ కృష్ణవేణి, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌లు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌లు, పారా లీగల్ వాలంటరీలు, ఖైదీలు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో నాగార్జున మహిళా కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కడప అర్బన్ : యోగివేమన యూనివర్సిటీ ప్రకటించిన డిగ్రీ పరీక్ష ఫలితాల్లో నాగార్జున మహిళా కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. నాలుగవ సెమిస్టర్ బిబిఎ గ్రూపులో 100 శాతం ఫలితాలు నమోదయాయని పేర్కొన్నారు. షేక్. తబసుమ్, సమీరా, మునిరా బేగం, కావ్య, ఇందు, సంధ్యారాణి, శ్రీజ, వరలక్ష్మి, పి.వి. నాగేశ్వరి, షేక్. అల్మాస్, టి.వి.సుజిత, బి.భావన, కె.వి.మాధవి, ఎస్ ఎస్ తన్మయి ఉత్తమ మార్కులు సాధించారని చెప్పారు. ఉత్తమ మార్కుల సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ అభినందించారు.

ఇష్టారాజ్యం

ప్రజాదృష్టి

కడప, పులివెందుల మున్సిపల్ కమిషనర్ల వివాదాస్పద వ్యవహారం 'సుబ్బి పెళ్లి ఎంకి చావుకు వచ్చిన' సామెతను తలపిస్తోంది. రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మున్సిపల్ కార్పొరేషన్ల పట్ల కూటమి నాయకుల వ్యవహారం వివాదాస్పదంగా మారింది. దేశంలోని ప్రతిపక్ష పాలిత రాష్ట్ర ప్రభుత్వాల పట్ల కేంద్ర ప్రభుత్వ నియమిత గవర్నర్లు వ్యవహరిస్తున్న తీరును తలపిస్తోందనే వాదన వినిపిస్తోంది. కార్పొరేషన్, మున్సిపాలిటీల సర్వసభ్య సమావేశాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పక్కనబెట్టి, తమ సొంత ఎజెండాల అమలుకు కూటమి నాయకత్వం పట్టుబడు తున్న వైనం విమర్శలకు తావిస్తోంది. ఎన్నో ఆశలతో ఓట్లేసి గెలిపించిన ప్రజల్ని వృథా ప్రహసనాలతో నిరుత్సాహపరచడం ఏమిటో ఆలోచన చేయాలి. కడప కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే, పులివెందుల మున్సిపల్ సమావేశంలో కూటమి నాయకుల వివాదాస్పద వ్యవహారాల పట్ల ఆయా పాలకవర్గాలు కమిషనర్లను సరెండర్ చేయాలని తీర్మానాలు చేయడం, తరుచుగా న్యాయస్థానాలను ఆశ్రయించడం వంటి ఘటనలతో మున్సిపల్ అధికార యంత్రాంగం చిక్కులు, విమర్శల పాలవుతుండడం చర్చనీయాంశంగా మారింది. అధికార పార్టీ అండ చూసుకుని కూటమి నాయకుల పట్ల విధేయత చూపుతూ పక్షపాతంగా వ్యవహరించడం పట్ల న్యాయస్థానాలు సీరియస్‌గా పరిగణిస్తే పరిస్థితేమిటనే విశ్లేషణలు ఉన్నాయి. ఇటువంటి వివాదాస్పద పరిస్థితుల నేపథ్యంలో మున్సిపల్, కార్పొరేషన్ అధికారులను ఎవరు కాపాడతారనే ప్రశ్న వినిపిస్తోంది. కార్పొరేషన్, మున్సిపల్ పాలక వర్గాలు, కూటమి నాయకులు పరస్పరం పంతాలకు పోవడం వల్ల మున్సిపల్ అధికారులను ఇబ్బందుల్లోకి నెట్టిన వారవుతారనే సంగతిని గ్రహించాల్సి ఉంది. బద్వేల్ నియోజకవర్గ పరిధిలోని కాశినాయన ఆశ్రమానికి ఏర్పాటు చేసిన బస్సు సదుపాయం తరుచుగా వివాదాస్పదంగా మారడం ఆందోళన కలిగిస్తోంది. దేశంలోనే అరుదైన నిత్యాన్నదాన సదుపాయం కలిగిన కాశినాయన క్షేత్రానికి వందలాది మంది యాత్రికులు వెళ్తుండడం పరిపాటి. అటవీ ప్రాంతాల పరిధిలోని ఆశ్రమానికి వెళ్లడానికి సంబంధించిన వైల్డ్‌లైఫ్ తదితర సమస్యలను కేంద్ర అటవీ పర్యావరణ శాఖలను సంప్రదించి శాశ్వత పరిష్కారాన్ని చూపిం చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అన్నమయ్య జిల్లా రాజంపేట అసెంబ్లీ ఎన్నిక బరిలో నిలిచిన సుగవాసి బాలసుబ్రమణ్యం టిడిపికి రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇంతటితో ఆగకుండా ప్రతిపక్ష వైసిపిలో చేరడం అందరి దృష్టినీ ఆకర్షించింది. సుగవాసి రాజీనామా నేపథ్యంలో రాజంపేట, రాయచోటి అసెంబ్లీల్లో అధికార టిడిపి బలహీన పడే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. రాయచోటిలో తీవ్రమైన ప్రభావం చూపించే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. కడప జిల్లాలో ఎంతో అట్టహాసంగా టిడిపి రాష్ట్ర మహానాడు నిర్వహించిన అధిష్టానం నాయకులను సమన్వయం చేసు కోవడంలో తడబడినట్లు కనిపిస్తోంది. ప్రత్యర్థి వైఎస్ కుటుంబానికి పట్టుకలిగిన ఉమ్మడి కడప జిల్లాలో టిడిపి అధిష్టానం ప్రత్యర్థికి చేతులారా అవకాశం ఇస్తోంది. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే ఇటువంటి తరహా అసమ్మతిని అదుపు చేయడంలో విఫలం కావడం ఆందోళన కలిగి స్తోంది. 2029 సార్వత్రిక ఎన్నికల సమయం దగ్గర పడే కొద్దీ రాజకీయం మరిన్ని మలుపులు తీసుకునే అవకాశం ఉంటుందని గ్రహించాల్సిన అవసరం ఉంది.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి



బిటెక్ రవికి వినతిపత్రం అందజేస్తున్న హిదాయతుల్లా

ఈద్గా ప్రహరీ నిర్మాణానికి నిధులు కేటాయించండి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె ఈద్గా మైదానానికి ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని ముల్లా మసీదు కమిటీ అధ్యక్షుడు హిదాయతుల్లా కోరారు. శనివారం పులివెందులలోని టిడిపి కార్యాలయంలో టిడిపి పులివెందుల ఇన్‌ఛార్జ్ బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డిని, టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డిని హిదాయతుల్లా, టిడిపి మండల కార్యదర్శి పీరా సాహెబ్ ఆధ్వర్యంలో మసీదు కమిటీ సభ్యులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈద్గాకు పూర్వీకులు కట్టిన ప్రహరీ పూర్తిగా శిథిలావస్థకు చేరిందన్నారు. ఈద్గా మైదానంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు వివరించారు. ప్రతి ఏడాది ఈద్గా మైదానంలో ముస్లింలు నమాజ్ చేసుకుంటారన్నారు. ఈ నేపథ్యంలో శిథిలమైన ప్రహరీ స్థానంలో కొత్తగా నిర్మించేందుకు ప్రభుత్వం నుండి నిధులు మంజూరు చేయించాలని కోరారు. ఇందుకు బిటెక్ రవి సానుకూలంగా స్పందించారు. మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్ దృష్టికి కూడా తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తానని చెప్పారు. కార్యక్రమంలో మసీదు ఇమాం మౌలానా కరీముల్లా, మసీదు కమిటీ సభ్యులు షేక్షావలి, నౌషాద్ ఆలీ బాషా, మహమ్మద్, నజీర్ పాల్గొన్నారు.

పి.వి.నరసింహారావు ఆర్థిక మాంత్రికుడు

ప్రజాశక్తి - వేంపల్లె

మాజీ ప్రధాని పివి నరసింహారావు ఆర్థిక మాంత్రికుడు, గొప్ప పరిపాలనాదక్షుడు, తెలుగు బృహస్పతి అని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. శనివారం వేంపల్లెలో కాంగ్రెస్ నాయకులు మాజీ ప్రధాని పివి నరసింహారావు 104వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ పివి స్వాతంత్ర్య సమరయోధుడు, బహు భాషా కోవిదుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి అన్నారు. ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ మంత్రి వర్గాల్లో పివి రక్షణ, విదేశాంగ, హోం, మానవ వనరుల శాఖ మంత్రిగా పని చేసినట్లు తెలిపారు. క్లిష్ట సమయంలో ప్రధాన మంత్రి పదవి స్వీకరించి. మైనారిటీ ప్రభుత్వాన్ని సమర్థవంతంగా నడిపారని ప్రశంసించారు. ఆర్థిక సంస్కరణలు చేపట్టి దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుండి కాపాడిన అపర చాణక్యుడని కొనియాడారు. కార్యక్రమంలో అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, నాగరాజు, శేఖర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి సూచించారు. శనివారం మండలంలోని బిదనంచర్లలో ఆయన చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ తడిపొడి చెత్తను వేరు చేసి గ్రీన్ అంబాసిడర్లకు అందజేయాలన్నారు. చెత్తను రోడ్డుపై వేయరాదన్నారు. మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని పంచాయతీ సెక్రటరీ సూచించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డి వెంకటరాముడు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో లేపాక్షి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

యోగి వేమన యూనివర్సిటీ కడప శనివారం విడుదల చేసిన డిగ్రీ 2,4 సెమిస్టర్ ఫలితాల్లో లేపాక్షి డిగ్రీ కళాశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారని కరస్పాండెంట్ రాఘవరెడ్డి, ప్రిన్సిపల్ రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ ఫలితాల్లో కళాశాల విద్యార్థులు 4వ సెమిస్టర్‌లో బిఎస్సీ కంప్యూటర్స్ విభాగంలో 10 జీపిఏకు గానూ మల్లేశ్వరి 9.8, షాహీన్ 9.4, దస్తగిరి 9.4, బికాం కంప్యూటర్స్ విభాగంలో జువేరియా 9.45, పాల్గుణ 9.35, ఆయిషా 9.25, 2వ సెమిస్టర్ ఫలితాల్లో బిఎస్సీ కంప్యూటర్స్ విభాగంలో గురు పల్లవి 9.42, భాగ్యశ్రీ 9.17, బికాం కంప్యూటర్స్ విభాగంలో కరిష్మా 9.42, కుందవ 9.08 జీపిఏతో సత్తా చాటారని వివరించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను వారితోపాటు కళాశాల అధ్యాపకులు అభినందించారు.

లోక్‌అదాలత్‌లో సత్వర పరిష్కారం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

లోక్‌అదాలతో ద్వారా సత్వర పరిష్కారం లభిస్తుందని జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్.భార్గవి తెలిపారు. స్థానిక కోర్టులో శనివారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ జూలై 5న జాతీయ లోక్‌అదాలతో నిర్వహించనున్నట్లు తెలిపారు. న్యాయవాదులు సంబంధిత కక్షిదారులతో మాట్లాడి రాజీ మార్గాన పరిష్కరించుకునేలా చూడాలన్నారు. పోలీస్ అధికారులు లోక్‌అదాలత్‌లో పరిష్కరించే కేసులు ఏమైనా ఉంటే అందుకు తగ్గ బాధితులను సమాయత్తం చేయాలన్నారు. అనంతరం సబ్ జైల్‌ను సందర్శించి అక్కడి వసతులపై ఆరా తీశారు. సబ్ జైల్ సూపరింటెండెంట్ హర్షవర్ధన్ రెడ్డితో మాట్లాడి అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వ వెనుకబడిన తరగతి విద్యార్థుల వసతి గృహాన్ని సందర్శించారు. అక్కడ వంట సామగ్రిని, సరుకులను తనిఖీ చేశారు. సమావేశంలో డిఎస్‌పి న్యాయ వాదులు, హాస్టల్ వార్డెన్, కోర్టు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

భూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

రాయలసీమ జిల్లాల పరిధిలో పేరుగాంచిన శ్రీఅంకాలమ్మ తల్లి అమ్మవారు వెలసిన అంకాలమ్మ గూడూరులో ఆలయానికి సంబంధించిన భూమి అన్యక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు తహశీల్దార్ వెంకట సాయినాథ్ రెడ్డిని కోరారు. మండలంలోని అంకాలమ్మ గూడూరు, కడప నాగయ్య పల్లె, బొజ్జయిపల్లె గ్రామాల వారు శనివారం రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్‌కు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ప్రజలు మాట్లాడుతూ అంకాలమ్మ గూడూరులో ఆలయం ఎదురుగా ఉన్న సర్వే నెంబరు 392 ఏలో ఉన్న 2.77 ఎకరాలు భూమిని ఆక్రమించేందుకు కొంతమంది వ్యక్తులు పైరవీలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ స్థలంలో తిరుణాల సందర్భంగా పలు కార్యక్రమాలు చేపడుతుంటారని వివరించారు. ఆక్రమణ యత్నాలపై సమగ్రంగా విచారించి అమ్మవారి స్థలాన్ని కాపాడాలని వారు కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సోమ కొండారెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజలు

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు ఖర్చు తగ్గుతుందని శాస్త్రవేత్త సాయి మహేశ్వరి సూచించారు. మండలంలోని కుమ్మరాంపల్లె రైతు భరోసా కార్యక్రమంలో శనివారం ఆమె ప్రకృతి వ్యవసాయంపై రైతులకు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో రైతులు పంటలు సాగు చేసే పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయన్నారు. అనంతరం ఎఒ శివశంకర్ రెడ్డి మాట్లాడుతూ రైతులు పంటల్లో అధిక దిగుబడులు సాధించాలంటే పాడి పంట చాలా ముఖ్యమని తెలిపారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేపట్టి మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని రైతులను కోరారు. డ్రోన్ పథకాన్ని సన్నకారు రైతులు అందిపుచ్చుకోవాలని కోరారు. కషాయాల ద్వారా ఎరువుల తయారీ, పురుగులు, తెగుళ్ల యాజమాన్య, పశుగ్రాస యాజమాన్య పద్ధతులు, గొర్రెల, మేకల పెంపకంలో మెలకువలు, పెరటి కోళ్ల పెంపకం, పాలు ఉత్పత్తి, పశువుల్లో పాటించాల్సిన మేలైన పద్ధతులను రైతులకు పశు విజ్ఞాన విభాగం శాస్త్రవేత్త సురేష్‌కుమార్ సూచనలిచ్చారు. అనంతరం గ్రామంలో సాగు చేసిన కూరగాయల పంటలను అధికారులు పరిశీలించి, సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఎపిసిఎన్ఎఫ్ సిబ్బంది ప్రతాప్, రైతులు పాల్గొన్నారు.

కళ్లను ప్రభావితం చేసే తీవ్రమైన రుగ్మత.. థైరాయిడ్

ఎల్‌విపిఇఐ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ కావ్య మాధురి బెజ్జంకి

ప్రజాశక్తి- కడప అర్బన్



థైరాయిడ్ అనగానే జుట్టు రాలడం, శరీర బరువుకు సంబంధించిన సమస్యలు, శక్తి స్థాయిలు, హార్మోన్‌ల అసమతుల్యత లాంటి ప్రభావాలు మాత్రమే మనకు తెలుసని, ఈ వ్యాధి కంటిని కూడా ప్రభావితం చేస్తుందని ఎల్‌విపిఇఐ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ కావ్య మాధురి బెజ్జంకి అన్నారు. ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కంటి వ్యాధి అనేది థైరాయిడ్ గ్రంథులు సరిగ్గా పనిచేయని వారిలో కనిపించే ఒక రుగ్మత అన్నారు. దీని కారణంగా కళ్ల రూపంలోనూ, పనితీరులోనూ పెద్దగా మార్పులు రావచ్చని పేర్కొన్నారు. హైపర్ థైరాయిడిజం (ఓవర్ యాక్టివ్ థైరాయిడ్) ఉన్నవారిలో ఇది సర్వసాధారణమని తెలిపారు. థైరాయిడ్ స్థాయిలు పూర్తిగా సాధారణంగా ఉన్నప్పుడు కూడా ఇది సంభవించే అవకాశం ఉందన్నారు. థైరాయిడ్ కంటి వ్యాధిలో, శరీర రోగనిరోధక వ్యవస్థ పక్కదారి పట్టి కళ్ళ చుట్టూ ఉన్న కొవ్వు, కండరాలపై ప్రభావం చూపి, అవి ఉబ్బేలా చేస్తుందని చెప్పారు. ఫలితంగా కళ్ళు ఉబ్బినట్టుగా, పొడుచుకు వచ్చినట్టుగా కనిపించడం, కనురెప్పల ఉపసంహరణ (కళ్ళు వెడల్పుగా తెరుచుకుని ఉండి, తెల్లటి భాగం అధికంగా కనిపించడం), కళ్ళు పూర్తిగా మూసుకోవడంలో ఇబ్బంది కలగడం (లాగోఫ్తాల్మోస్) కళ్ళ చుట్టూ అసౌకర్యంగా, ఒత్తిడిగా అనిపించడం ద్వంద్వ దృష్టి లేదా తీవ్రమైన కేసుల్లో దృష్టి కోల్పోవడం అనే ప్రధాన లక్షణాలు ఉంటాయని చెప్పారు. ముందుగానే గుర్తించి చికిత్స అందిస్తే మంచి ఫలితాలను ఆశించవచ్చు అన్నారు. ప్రారంభ దశల్లో, వాచిన కంటి కండరాలకు చేసే ఇంజెక్షన్లు వాపును తగ్గించడంలోనూ, లక్షణాల నుండి ఉపశమనం పొందడంలోనూ సహాయపడతాయన్నారు. చికిత్స చేయకుండా వదిలేస్తే, వాచిన కండరాలు దృష్టి నాడిని కుదించగలవు, ఇది కొంతమంది రోగులలో శాశ్వత దృష్టి నష్టానికి దారితీస్తుందని చెప్పారు. థైరాయిడ్ వ్యాధి ఉన్న వారిలో కంటిలో అసాధారణ మార్పులు గమనించినట్లయితే, ముందుగానే వైద్య సహాయం తీసుకోవడం చాలా మంచిదన్నారు.

ఎంఆర్‌సిలో డిఇఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-కడప అర్బన్

పలు అంశాలపై ఆరా నగరంలోని కాగితాలపెంటలో ఉన్న మండల రిసోర్స్ సెంటర్‌ను (ఎంఆర్‌సి) డిఇఒ షంషుద్దీన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంఇఒ గంగిరెడ్డితో పలు విషయాలపై ఆరా తీశారు. కడప ఎంఇఒ పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల ఎంతమంది, వారి సర్వీసు రిజిస్టర్లు తీసుకురావాలని చెప్పినట్లు తెలిసింది. దాదాపు 400 మంది తన పరిధిలో కడప మండల పరిషత్, కార్పొరేషన్ పరిధిలో ఉన్నట్లు ఎంఇఒ సమాధానమిచ్చినట్లు తెలిసింది. సర్వీస్ రిజిస్టర్లు తీసుకురావాలని ఎంఇఒను డిఇఒ ఆదేశించారు. 300 తమ వద్ద ఉన్నాయని ఎంఇఒ సమాధానం ఇచ్చారు. మిగతా 100 ఎక్కడ ఉన్నాయని డిఇఒ ప్రశ్నించగా ఒక ఉపాధ్యాయ సంఘం నేత వద్ద ఉన్నాయని సమాధానం ఇచ్చారు. ఎంఇఒ వద్ద ఉన్న సర్వీస్ రిజిస్టర్‌లను డిఇఒ ముందు ఉంచారు. వీటిని డిఇఒ పరిశీలించగా 150 మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. 300 ఉన్నాయని చెప్పారు కానీ 150 ఉన్నాయి మిగిలిన సర్వీస్ రిజిస్టర్లు ఎక్కడ ఉన్నాయని ప్రశ్నించగా ఒక ఉపాధ్యాయ సంఘ నేత వద్ద ఉన్నాయని మరో మారు సమాధానం ఇచ్చారు. బయటి వ్యక్తుల వద్దకు ఉపాధ్యాయుల ఎస్‌ఆర్‌లు ఎలా వెళ్లాయని ఎంఇఒను డిఇఒ ప్రశ్నించారు. దీనిపై ఎంఇఒ గంగిరెడ్డి మౌనం వహించారు. పలు గణాంకాలపై ఎంఇఒ-2ను కూడా ప్రశ్నించగా ఆయన నుండి సరైన సమాధానం రాకపోవడంతో ఎంఇఒ-2ను కూడా మందలించారు. అస్తవ్యస్తంగా ఉన్న అంశాలన్నింటినీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళతానని డిఇఒ చెప్పినట్లు తెలిసింది. ఉపాధ్యాయ బదిలీలలో ప్రాధాన్యత కేటగిరీకి సంబంధించి బదిలీల చట్టం మేరకు ఒక పాఠశాలలో 40 శాతం ఉపాధ్యాయులు మాత్రమే పనిచేయాల్సి ఉండగా కడప, ప్రొద్దుటూరు ఎంఇఒలు ఒక పాఠశాలకు 100 శాతం ప్రాధాన్యత కింద పోస్టులు చూపించడం జరిగింది. దీనిపై ఉపాధ్యాయ సంఘాలు గతంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అందులో భాగంగా డీఈవో కడప ఎంఆర్‌సిని ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు తెలుస్తుంది. కడప ఎంఇఒ గంగిరెడ్డి బయటి వ్యక్తుల వద్ద ఉపాధ్యాయుల ఎస్‌ఆర్‌లు ఉన్నట్లు డిఇఒ రాతపూర్వకంగా సమాచారం తీసుకు వెళ్లినట్లు తెలిసింది. ఎంఇఒపై చర్యలు ఉంటాయో లేదో వేచి చూడాలి.

బాలుర ఉన్నత పాఠశాలకు బెంచీలు వితరణ

ప్రజాశక్తి - ముద్దనూరు :స్థానిక బాలుర ఉన్నత పాఠశాల చెన్నారెడ్డిపల్లె గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి నరసింహ పాఠశాలకు రూ.40వేలు విలువ చేసే 15 బెంచీలు వితరణ చేశారు. దాత సోదరులు మైలవరం మండలం గృహ నిర్మాణ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ ఓబులేసు, రాజశేఖర్, కళ్యాణ్‌కుమార్ బెంచీలు అందజేశారు. పూర్వ విద్యార్థి, దాత నరసింహ అమెరికాలో స్థిరపడి తను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి చేయూతనివ్వాలనే లక్ష్యంతో పాఠశాలకు బెంచీలు వితరణ చేయడం సంతోషకరమని ప్రధానోపాధ్యాయులు ఓబులేసు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాబు మాధవరెడ్డి, ప్రసాద్, అన్వర్ బా షా పాల్గొన్నారు.

అనుమతి లేని మందులు అమ్మితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

అనుమతి లేని మందులు, ఎరువులు రైతులకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని మైదుకూరు ఎడిఎ కృష్ణమూర్తి హెచ్చరించారు. మైదుకూరు మండలంలోని విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల డీలర్లతో శనివారం ఆయన స్థానిక మండల వ్యవసాయ అధికారి బలగంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో వెలుగు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. నగదు బిల్లును రైతులకు ఇవ్వాలని సూచించారు. కాలం చెల్లిన మందులు, విత్తనాలు దుకాణాల్లో ఎట్టి పరిస్థితుల్లో ఉంచరాదన్నారు. ప్రతి రోజు స్టాక్ రిజిస్టర్, బిల్లు పుస్తకాలను అప్డేట్ చేసి ఉంచాలని తెలిపారు. ధరల పట్టిక, స్టాక్ బోర్డ్‌ను ప్రతిరోజు ఏర్పాటు చేయాలని తెలిపారు. నిషేధించిన పురుగు మందులను ఎట్టి పరిస్థితుల్లో అమ్మకాలు చేపట్టకూడదన్నారు. లైసెన్స్ లేకుండా గ్రామాల్లో ఎవరైనా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

అడ్మిషన్ల ప్రక్రియను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె : ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటిలో 2025-26 ఏడాదికి సంబంధించి జరిగే అడ్మిషన్ల పక్రియను ట్రిపుల్‌ఐటి క్యాంపస్ ఉద్యోగులు విజయవంతం చేయాలని ఆర్యేవ్యాలీ డైరెక్టర్ కుమార స్వామి గుప్తా సూచించారు. శనివారం మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి క్యాంపస్ అడ్మిషన్ల పక్రియపై ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సెంట్రల్ లైబ్రరీలో అడ్మిషన్ల ప్రక్రియను ఈనెల 30, జూలై 1న రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అడ్మిషన్లకు సెలెక్ట్ అయిన విద్యార్థులకు ఇప్పటికే కాల్ లెటర్లు పంపామన్నారు. కాల్ లెటర్‌లో చెప్పిన విధంగా విద్యార్థులు కౌన్సిలింగ్‌కు హాజరయ్యేటప్పుడు ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు, మూడు సెట్లు జిరాక్స్ పత్రాలను వెంట తెచ్చుకోవాలన్నారు. సంబంధిత ఫీజుతో పాటు ఇచ్చిన తేదీనే విద్యార్థులు కౌన్సిలింగ్‌కు హాజరు కావాలన్నారు. అడ్మిషన్లకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. సమావేశంలో అకాడమిక్ డీన్ రమేష్ కైలాస్, అసోసియేట్ డీన్స్, సెక్యూరిటీ అధికారులు, పిఆర్‌ఒలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో వసతులపై జడ్‌పిటిసి ఆరా

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక గురుగు వీధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని జడ్పీటీసీ ఎం.రవికుమార్‌రెడ్డి తనిఖీ చేశారు. శనివారం స్థానిక గరుగువీధిలోని అంగన్వాడీ కేంద్రంలో మౌలిక వసతులపై ఆరా తీశారు. మహిళలు కుట్టు శిక్షణ కూడా నేర్చుకునేందుకు అవగాహన కల్పించాలని అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు. ప్రభుత్వం ద్వారా వస్తున్న పథకాలు పిల్లల తల్లి దండ్రులకు సక్రమంగా అందేలా చూడాలని జడ్పీటీసీ కోరారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. మండల గ్రాంట్ నిధులతో గరుగువీధిలోని అంగన్వాడీ కేంద్రంలో మౌలిక వసతులు, ఇతర పనులను ఎంపిటిసి పద్మా రాజ్‌కుమార్ పూర్తి చేశారని చెప్పారు. ఆహ్లాదకరంగా అంగన్వాడీ కేంద్రం ఉందని, అందుకు తగ్గట్టు చిన్నారులకు విద్యాభ్యాసం చేయాలని కోరారు. ఎంపిటిసి పద్మా రాజ్‌కుమార్, అంగన్వాడీ కార్యకర్త హసీనా పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించాలి

ప్రజాశక్తి - లింగాల

పోటీ ప్రపంచంలో రాణించాలంటే చదువుతోపాటు వివిధ రంగాల్లో విద్యార్థులలో ప్రతిభను గుర్తించి, ఆ దిశగా అడుగులు వేయాలని ఎంఇఒ రామకృష్ణయ్య సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించిన సంసిద్ధత మేళా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ఒకటో తరగతిలో చేరిన విద్యార్థుల్లో సామర్థ్యాలను పరీక్షించామన్నారు. విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. పలు రకాల క్రీడల బొమ్మలు తయారు చేసి విద్యార్థులు గుర్తించేలా వారికి పరీక్షలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో లింగాల జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, ప్రథమ జిల్లా కో-ఆర్డినేటర్ కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పారదర్శకంగా అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - ముద్దనూరు

జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులు పారదర్శకంగా చేపట్టాలని మండల నాయకులు డాక్టర్ కటికరెడ్డి మధుసూదనరెడ్డి ఎన్‌హెచ్ అధికారులకు సూచించారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలి నుంచి పాత బస్టాండ్ వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు, మురుగు కాలువ నిర్మాణాన్ని శనివారం మధుసూదనరెడ్డి, జాతీయ రహదారి డిఇ, ఎఇ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలన్నారు. రోడ్డు విస్తరణ, మురుగు కాలువ నిర్మాణం, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు పారదర్శకంగా చేయాలన్నారు. దుకాణదారులు, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా నిబంధనల ప్రకారం పనులు చేపట్టాలన్నారు. పార్టీలకు అతీతంగా పేద, ధనిక తేడా లేకుండా సమ న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో యువ నాయకులు గుణవంతరెడ్డి, విద్యుత్ లైన్ ఇన్స్‌పెక్టర్ యోగానంద రెడ్డి, నాగరాజు, వినోద్ పాల్గొన్నారు.

వేదాంత ఆస్పత్రిలో అత్యాధునిక వైద్య సేవలు



మీడియాతో మాట్లాడుతున్న ప్రముఖ వైద్యులు

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని అక్కాయపల్లె పార్కు ఎదురుగా ఉన్న వేదాంత ఆస్పత్రిలో అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని ప్రముఖ న్యూరో సర్జరీ నిపుణులు డాక్టర్ క్రాంతి కుమార్, ప్రముఖ గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ శ్రావణ్ కుమార్ రెడ్డి, కిడ్నీ, మూత్ర సంబంధిత వ్యాధి నిపుణులు, ల్యాపరోస్కోపిక్ సర్జన్ డాక్టర్ దినేష్ కుమార్ రెడ్డి, జనరల్ మెడిసిన్, ఇంటెన్సివ్ కేర్ స్పెషలిస్ట్, షుగర్ వ్యాధి నిపుణులు డాక్టర్ శ్రీ మాధుర్య, గుండె శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ అశోక్ కుమార్, ఫిజియోథెరపి వైద్యులు డాక్టర్ శివ శంకర్ తెలిపారు. శనివారం వారు మీడియాతో మాట్లాడుతూ జనరల్ మెడిసిన్ సీనియర్ వైద్యులు డాక్టర్ పి.మురళీ మాధవ్ సహాయ సహకారాలతో జిల్లాలోనే అతిపెద్ద విశాలమైన వంద పడకల ఆసుపత్రిని అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు. ప్రజలకు అత్యాధునిక వైద్య సదుపాయాలు ఇప్పుడు కడపలో ఉన్న మన వేదాంత హాస్పిటల్స్ లో అందరికీ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అత్యాధునిక క్యాథ్ ల్యాబ్, బ్రెయిన్, స్పైయిన్ కి హోల్ ఆపరేషన్లు, అత్యాధునిక లేజర్‌తో కిడ్నీలో రాళ్ల కరిగించుట, అడ్వాన్స్‌డ్ క్రిటికల్ కేర్ విభాగం, అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అపార అనుభవం గల డాక్టర్లు, వైద్య సిబ్బంది చే వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. 24 గంటలు సర్వీస్ అందుబాటులో ఉందన్నారు. ప్రత్యేక వైద్య సౌకర్యాలు న్యూరో సర్జరీ, కార్డియాలజీ, కిడ్నీ మూత్ర సంబంధిత వ్యాధులు, లాప్రోస్కోపిక్, జనరల్ మెడిసిన్ ఇన్టెంటివ్ కేర్ స్పెషాలిటీ, షుగర్, గుండె శస్త్ర చికిత్స, ఫిజియోథెరపీ సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అత్యవసర కేసులను హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై వెళ్లే అవసరం లేకుండా అన్ని సౌకర్యాలతో వేదాంత హాస్పిటల్స్ అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 08562-256789, 9666015678 నంబర్లు సంప్రదించాలని కోరారు.



నిరసన వ్యక్తం చేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు, విద్యార్థినులు

నిందితులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పశ్చిమ బెంగాల్‌లో లా విద్యార్థినిపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డివైఎఫ్ఐ జమ్మలమడుగు పట్టణ ఉపాధ్యక్షులు సుబహాన్ డిమాండ్ చేశారు. ఆ మేరకు శనివారం స్థానిక శ్రీనివాస డిగ్రీ కాలేజీలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సుబహాన్ మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్‌లో ఆర్జీ కార్ మెడికల్ కాలేజీలో వైద్య విద్యార్థిని సంఘటన మరవక ముందే మళ్లీ లా విద్యార్థినిపై అత్యాచార సంఘటన దేశవ్యాప్తంగా సంచలం సృష్టించిందన్నారు. దేశంలో మహిళలపై, విద్యార్థినులపై అత్యాచారాలు, దాడులు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. నిత్యం ఎక్కడో ఒక చోట రోజు అత్యాచార ఘటనలు కనబడుతూనే ఉన్నాయన్నారు. వీటిని అరికట్టడంలో పాలక ప్రభుత్వాలు విఫలం చెందాయన్నారు. దేశంలో బలమైన చట్టాలు, శిక్షలు అమలు జరిగినప్పుడే ఇలాంటి సంఘటనలు తగ్గే అవకాశం ఉంటుందన్నారు. డివైఎఫ్ఐ పట్టణ నాయకులు కృష్ణారెడ్డి, విద్యార్థినులు పాల్గొన్నారు.

'ప్రజాదర్బార్'లో బిటెక్ రవి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల టిడిపి కార్యాలయంలో శనివారం మాజీ ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి(బిటెక్ రవి) ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలు బిటెక్ రవి దృష్టికి తెచ్చారు. సమస్యల పరిష్కారానికి ఆయన సానుకూలంగా స్పందిస్తూ.. సంబంధిత అధికారులను తక్షణమే ఆదేశించారు.



ఆర్థికసాయం అందజేస్తున్న టిడిపి నాయకులు

గాయపడిన మహిళకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని పాతూరులో ప్రమాదవశాత్తూ మిద్దె పైనుంచి పడి గాయపడిన రాధ అనే మహిళకు ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ మెంబర్ యాపరాల చిన్న రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ చొరవతో సీఎం రిలీఫ్ ఫండ్ కూడా త్వరలో అందిస్తామని బాధితురాలు రాధాకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ ఉపాధ్యక్షుడు యాపరాల లక్ష్మీనారాయణ, బురుగోళ్ల చిన్న, బండి అమర్నాథ్, తుపాకుల రమణ, సారధి పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు తొలగించండి

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక ఇమాంనగర్‌లో నెలకొన్న తాగునీటి ఇబ్బందులను తొలగించాలని టిడిపి యువనేత యాసిన్ కోరారు. శనివారం పంచాయతీ కార్యాలయంలో ఉన్న కార్యదర్శి మాధవరెడ్డిని ఆయన కలిసి ఫిర్యాదు చేశారు. రెండు రోజులు నుండి తాగునీరు రాక ఆ ప్రాంత ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. స్పందించిన ఇఒ వాటర్ స్కీమ్ సిబ్బందిని పిలిపించి తాగునీటి సరఫరాపై ఆరా తీశారు. ఇమాంనగర్ కాలనీకి నీటి సరఫరా చేయాలని సిబ్బందిని ఆదేశించారు. తాగునీటి సరఫరాలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కార్యదర్శి హెచ్చరించారు. ఆయా ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు ఉంటే ప్రజలు తన దృష్టికి తీసుకరావాలని ఇఒ కోరారు. వాటర్ స్కీమ్ సిబ్బంది ప్రతిరోజూ ఆయా ప్రాంతాలను పరిశీలిస్తూ తాగునీరు సరఫరా అయ్యేలా పనులు చేపట్టాలని సిబ్బందిని కోరారు.

ప్రభుత్వం కుట్రపూరిత ఆలోచనలు మానుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కూటమి ప్రభుత్వం కుట్ర పూరిత ఆలోచనలను మానుకోవాలని వైసిపి బిసి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్లూరు సుదర్శన్ కోరారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్ జగన్ రెడ్డికి ప్రజల నుండి వస్తున్న ఆదరణను చూసి కూటమి ప్రభుత్వం సెక్యూరిటీని తగ్గించేందుకు ఆలోచిస్తోందన్నారు. ఇది కూటమి ప్రభుత్వానికి మంచిది కాదన్నారు. జడ్ ప్లస్ కేటగిరి భద్రత కల్పించాల్సిన ప్రభుత్వం కనీసం రోప్ పార్టీ కూడా ఇవ్వడం లేదన్నారు. ప్రజాదరణ కలిగిన నాయకుడు ప్రజల్లోకి వెళ్లే సమయంలో రోప్ పార్టీ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. జగన్‌రెడ్డిని ప్రజల నుండి దూరం చేయాలని కూటమి ప్రభుత్వం పన్నాగాలు పన్నితే ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని పేర్కొన్నారు. మాజీ సిఎం జగన్‌కు సరైన భద్రతను కట్టుదిట్టం చేయాలని ఆయన కోరారు.



ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మెగా వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్): కెసిపి స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం విజయవంతమైందని చైర్‌పర్సన్ కృష్ణవేణమ్మ తెలిపారు. స్థానిక కొర్రపాడు రోడ్డులోని రిలయన్స్ ట్రెండ్స్ ఎదురుగా ఉన్న కెసి పుల్లయ్య స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌లో శ్రీశ్రీ హోలిస్టిక్ ఆసుపత్రి వారి సహకారంతో కెసి పుల్లయ్య పౌండేషన్ చైర్‌పర్సన్ కృష్ణవేణమ్మ, వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక గాంధీ రోడ్డులోని శ్రీశ్రీహోలిస్టిక్ ఆసుపత్రి వైద్యులు కార్డియాలజిస్టులు రాజ శేఖర శర్మ, బిఎల్ఎన్ రెడ్డి, ఆర్థో విభాగ వైద్యులు హరీష్ బాబు, జనరల్ మెడిసిన్ వైద్యులు నాగశేఖర్‌రెడ్డి వైద్య సేవలు అందజేశారు. 200 మంది ప్రజలు వైద్య సేవలు పొందారు. అవసరమైన వారికి పరీక్షలు, మందులు అందజేశారు. మెరుగైన చికిత్స కోసం గాంధీ రోడ్డులోని హాస్పిటల్‌కు రెఫర్ చేశారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య సంరక్షణపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో హోలిస్టిక్ ఆస్పత్రి సిబ్బంది నరసింహ, కెసి పుల్లయ్య ఫౌండేషన్ సిబ్బంది చలపతి పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు సీనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో

A.S No.78/2024

1. కె.సుబాషన రెడ్డి (వారి వారసులు)
2. కె.కుళ్ళాయమ్మ భర్త లేట్ సుబాషన రెడ్డి, హిందూ, 55 సం॥లు కోనవారిపల్లి గ్రామం, కొండాపురం మండలం, కడప జిల్లా. ...అప్పిలెంట్లు

వర్సెస్

సి. వెంకట సుబ్బమ్మ & లక్ష్మిదేవి భర్త లేట్ సి. వెంకట నారాయణ రెడ్డి 55 సం॥రాలు, కోనవారిపల్లి గ్రామం, కొండాపురం మండలం, కడప జిల్లా.

నోటీసు

పై నెంబరు అప్పీలులో 1వ రెస్పాండెంటు అయిన సి.లక్ష్మిదేవి గారు గతించి నందున ఆమె తరపున వారసులుగా చేర్చ కోరుతూ మరియు కలిగిన ఆలస్యంను మన్నించకోరుచు I.A.No. 896/2024, I.A.No. 897/2024, I.A.No. 898/2024 నెంబరు పిటిషన్‌లను దాఖలు చేసి వున్నారు. అట్టి పిటిషన్‌లో మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టులో 4.07.2025వ తేదీన ఉదయం 10:30 గం॥లకు ఖుద్దునగానీ, వకీలు ద్వారా గానీ తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును.

వాయిదా తేది : 4.07.2025

// By order of the Court //
SRI G. SRINIVASULU, B.Com., BL
Advocate, Proddatur